సాక్షి కర్నూలు

గురువారం । 4 । మే । 2023



రమణీయం.. రథోత్సవం

ఆళ్లగడ్డ: నారసింహుడి జయంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో బుధవారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ రథాన్ని లాగారు.



నందవరంలో హైకోర్టు జడ్జి

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవారిని హైకోర్టు జడ్జి జి.శ్యాంసుందర్ కుటుంబ సభ్యులతో కలసి బుధవారం సాయంత్రం దర్శించుకున్నారు.



..అభివృద్ధిపై మీరా మాట్లాడేది?

మైనింగ్, రియల్ ఎస్టేట్ మాఫియా వారిని వెంటబెట్టుకుని పాదయాత్ర చేస్తున్న లోకేష్ డోన్ అభివృద్ధిపై మాట్లాడడం హాస్యాస్పదమని మంత్రి బుగ్గన అన్నారు. 8లో

న్యూస్‌రీల్

కుడా వైస్ చైర్మన్‌గా ఎస్‌పీఎస్ఎన్ రెడ్డి



కర్నూలు(అర్బన్): జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారి ఎస్‌పీఎస్ఎన్ రెడ్డిని కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) వైస్ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జీ వెంకటేశ్వరరెడ్డి తన మాతృ సంస్థ అయిన ఏపీ ఆగ్రోస్‌కు వెళ్లి పోగా, అప్పటి నుంచి కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ ఏ భార్గవతేజ పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఖాళీగా ఈ పోస్టుకు ఎస్‌పీఎస్ఎన్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జే శ్యామలారావు జీఓ నంబర్: 270ని జారీ చేశారు. 2018లో గ్రూప్-1 ఉత్తీర్ణత సాధించిన ఎస్‌పీఎస్ఎన్ రెడ్డి త్వరలోనే సాంఘిక సంక్షేమ శాఖ నుంచి రిలీవ్ అయి కుడా వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి.

అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు 17 వరకు రిమాండ్

కర్నూలు: అక్రమ ఆస్తుల కేసులో అరెస్టయిన కర్నూలు డివిజనల్ కో–ఆపరేటివ్ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.సుజాతను అవినీతి నిరోధక శాఖ అధికారులు బుధవారం కర్నూలులోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చగా ఈనెల 17వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అక్రమ ఆస్తుల ఫిర్యాదుపై దర్యాప్తు పూర్తి కావడంతో ఆమెను ఏసీబీ కోర్టులో హాజరుపరచినట్లు ఏసీబీ డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. అయితే ఆమె బ్యాంకు ఖాతాలను పరిశీలించాల్సి ఉందన్నారు.

కొనసాగుతున్న అకాల వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో అకాల వర్షాలు కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 11 మండలాల్లో వర్షం కురిసింది. అకాల వర్షాల వల్ల జిల్లాలో వేసవి తీవ్రత గణనీయంగా తగ్గింది. అత్యధికంగా పత్తికొండలో 38, ఎమ్మిగనూరులో 23.2, మంత్రాలయంలో 19.4, ఆలూరులో 19.2, నందవరంలో 16.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మే నెల సాధారణ వర్షపాతం 40.1 మి.మీ., ఉండగా.. మొదటి నాలుగు రోజుల్లోనే 36.1 మి.మీ., వర్షపాతం నమోదైంది. జిల్లాలో అకాల వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

ప్రయివేట్ స్కూళ్లలో అడ్మిషన్లకు మరో అవకాశం

కర్నూలు సిటీ: విద్యాహక్కు చట్టం ద్వారా జిల్లాలోని అన్ని ప్రయివేట్ పాఠశాలల్లో అడ్మిషన్లకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఈ మేరకు డీఈఓ కార్యాలయ ఏడీ శ్యామూల్ పాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతి అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులు ఈ నెల 6 నుంచి 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 16 నుంచి 20వ తేదీ వరకు వెబ్‌సైట్‌లో వచ్చిన దరఖాస్తుల అర్హతలను నిర్ధారించి 22వ తేదీన తుది జాబితా ప్రకటిస్తామన్నారు. 24 నుంచి 28వ తేదీలోపు విద్యార్థులు అడ్మిషన్ పొందినట్లు యాజమాన్యాలు ధ్రువీకరించాలని పేర్కొన్నారు.

8 నుంచి మొక్కజొన్న కొనుగోళ్లు

- మద్దతు ధర రూ.1,962

కర్నూలు(అగ్రికల్చర్): 2022–23 రబీ సీజన్‌కు సంబంధించి మొక్కజొన్న దిగుబడులను ఈనెల 8వ తేదీ నుంచి మద్దతు ధరతు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దాదాపు రెండు వారాలుగా మద్దతు ధరతో మొక్కజొన్నను అమ్ముకునేందుకు రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఈనెల 8 నుంచి కొనుగోలు ప్రక్రియకు మార్క్‌ఫెడ్ అధికారులు రంగం సిద్ధం చేశారు. మద్దతు ధర రూ.1,962తో కొనుగోలు చేస్తున్నట్లు కర్నూలు, నంద్యాల మార్క్‌ఫెడ్ అధికారులు ప్రకటించారు. రైతులు దళారీలకు అమ్ముకొని నష్టపోకుండా కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతో అమ్ముకోవాలని సూచించారు.

కేజీబీవీల్లో ఫెయిలైన వారికి ప్రత్యేక తరగతులు

కర్నూలు సిటీ: కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో చదువుతూ ఇంటర్మీడియెట్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను బుధవారం ప్రారంభించారు. ఆదోని, ఆస్పరి, కోడుమూరు, గూడూరు, కల్లూరు కేజీబీవీల్లో ఈ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ తరగతులను సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ డాక్టర్ కే వేణుగోపాల్ తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. సప్లిమెంటరీ పరీక్షలు జరిగేంత వరకు తరగతులు ఉంటాయని, ఫెయిల్ అయిన ప్రతి విద్యార్థి పాస్ అయ్యేటట్లు శిక్షణ ఇవ్వాలన్నారు.

నాడి పట్టరు.. సమయానికి రారు!

- రోగులకు అందుబాటులో ఉండని కొందరు వైద్యులు
- పనిచేయని కొన్ని ఎక్స్‌రే, స్కానింగ్ మిషన్లు
- వైద్య పరీక్షలు లేక బయటకు వెళ్తున్న రోగులు
- కొనసాగుతున్న ప్రైవేట్ ల్యాబ్ నిర్వాహకుల దందా
- నేడు పెద్దాసుపత్రిని తనిఖీ చేయనున్న ఆరోగ్య శాఖ మంత్రి

ఖరీదైన పరికరాలు ఉంటాయి..వాటిలో కొన్ని పనిచేయవు.. నిపుణులైన వైద్యులు ఉంటారు.. వారిలో కొందరు రోగుల నాడి పట్టరు.. సమయపాలన పాటించరు.. రోగికి సపర్యలు చేసేందుకు అవసరమైన సిబ్బంది ఉంటారు.. వారిలో చాలా మందికి సహనం ఉండదు.. చావుబతుకుల్లో ఉన్న రోగులపై కాసింత దయ కూడా చూపరు..ఇదీ స్థూలంగా కర్నూలు పెద్దాసుపత్రికి పట్టిన నిర్లక్ష్యపు జబ్బు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజిని గురువారం ఆసుపత్రిని సందర్శించనున్నారు. పలు వార్డులను తనిఖీ చేయనున్నారు. ఈ సందర్భంగా పెద్దాసుపత్రికి పట్టిన నిర్లక్ష్యపు జబ్బుకు చికిత్స చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కర్నూలు(హాస్పిటల్): రాయలసీమ జిల్లాలకు పెద్ద దిక్కుగా నిలిచిన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ప్రతిరోజూ 2,500 నుంచి 3 వేల వరకు రోగులు వస్తుంటారు. ఆసుపత్రిలో చేరి చికిత్స పొందే వారు 1200 నుంచి 1500 మంది వరకు ఉంటారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు ఎన్ని వచ్చినా, ప్రభుత్వ ఆసుపత్రుల సంఖ్య పెరిగినా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య తగ్గడం లేదు. అయితే పెద్దాసుపత్రిలో కొందరు వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రోగుల సహనానికి పరీక్ష పెడుతున్నారు.

ల్యాబ్ పరీక్షలు బయటికే!

ఆసుపత్రిలోని 24 గంటల ల్యాబోరేటరీ, సెంట్రల్ ల్యాబ్‌లలో రోగులకు అవసరమైన అన్ని వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే కొంత కాలంగా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ల్యాబ్ రీఏజెంట్స్ కిట్స్ సరఫరా చేయడం లేదు. 24 గంటల ల్యాబ్‌లో ఆటో ఫుల్ ఆటోమేటెడ్ అనలైజర్ ద్వారా 26 రకాల వైద్యపరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుతం ఐదు మాత్రమే చేస్తున్నారు. వైద్యచికిత్సలో కీలకమైన ఎలక్ట్రోలైట్స్ పరీక్షలు సైతం ఇటీవల చేయడం లేదు. దీంతో పలు పరీక్షలకు రోగులు ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. మరోవైపు ఆసుపత్రిలో ల్యాబ్ పరీక్షలు సకాలంలో చేయరని, సక్రమంగా రిపోర్టులు ఉండవని చెబుతూ ప్రైవేటు ల్యాబ్‌ల నిర్వాహకులు రోగులను ప్రైవేటు ల్యాబ్‌లకు తరలిస్తున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ఈ దందా సాగుతోంది. దీనికితోడు ఇటీవల ఆసుపత్రిలో లేని వైద్యపరీక్షలను అధికారులే ఓ ప్రైవేటు ల్యాబ్‌కు ఇవ్వడం సైతం విమర్శలకు తావిస్తోంది. ఈ ల్యాబ్ నిర్వాహకులు వారికి పేర్కొన్న పరీక్షలే గాకుండా ఆసుపత్రిలో చేస్తున్న పరీక్షలు కూడా చేస్తూ ఆసుపత్రికి భారీగా బిల్లులు చేతికి ఇస్తున్నారు. ఇందులో ఓ అధికారి పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీని వల్ల ఆసుపత్రి ఖజానాకు చిల్లు పడుతోంది.

రోగులకు చీత్కారాలు

ఆసుపత్రికి వచ్చిన రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని ఉన్నతాధికారులు ఎంతగా చెబుతున్నా పలువురు పీజీ వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బందిలో మార్పు కనిపించడం లేదు. రోగులకు చికిత్స అందించడంలో, వారికి సరైన సమాధానం ఇవ్వడంలో వైద్యులు, సిబ్బంది నుంచి చీత్కారాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. క్యాజువాలిటీ నుంచి ఏఎంసీకి, ఇతర విభాగాలకు రోగులను తరలించాల్సిన విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. గంటల తరబడే కాదు కొన్నిసార్లు ఒకరోజుకు పైగా క్యాజువాలిటీలో రోగులు మగ్గాల్సి వస్తోంది. క్యాజువాలిటీతో పాటు అన్ని విభాగాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఏదైనా వివరణ, చికిత్స విషయంలో మాట్లాడాలని నర్సుల వద్దకు వెళితే వారి నుంచి దండించే పద్ధతిలో సమాధానాలు వస్తున్నాయి.

ఇంటి నుంచే ముఖహాజరు

కర్నూలు మెడికల్ కాలేజీ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలల్లో పనిచేసే వైద్యులు కొందరు విధులను నిర్లక్ష్యం చేస్తున్నారు. కొందరు ఉదయం హాజరు వేసి కాసేపు ఉండి మళ్లీ మధ్యాహ్నం ఒంటి గంటకు వచ్చి హాజరు వేసి వెళ్లిపోయి తిరిగి 4 గంటలకు వచ్చి హాజరు వేస్తున్నారు. కొందరు మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉండి హాజరు వేసి వెళ్లిపోయి తిరిగి సాయంత్రం 4 గంటలకు వచ్చి హాజరు వేస్తున్నారు. ఈ జాబితాలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పలు సూపర్‌స్పెషాలిటీ విభాగాలు, మెడికల్ కాలేజీలో నాన్‌క్లినికల్ విభాగాల వైద్యులు ఉన్నారు. మరికొందరు మమ్మల్నెవరు అడిగేది అన్నట్లు ఇళ్లు, క్లినిక్‌ల నుంచే ముఖ హాజరు వేస్తున్నారు. ఇటీవల కర్నూలు నగరంలోని గాయత్రి ఎస్టేట్, టెలికామ్ నగర్, ప్రకాష్‌నగర్, శ్రీరామ్‌నగర్, అల్లూరి సీతారామనగర్ సెంటర్ల నుంచి తరచూ డ్యూటీ అవర్స్‌లో ముఖ ఆధారిత హాజరును పలువురు వైద్యులు వేసినట్లు అధికారులకు ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైంది. అయినా వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

నేడు ఆరోగ్యశాఖ మంత్రి రాక

రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని గురువారం కర్నూలు మెడికల్ కాలేజీలోని మహిళల హాస్టల్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని రేడియోడయాగ్నోస్టిక్ బ్లాక్‌ను ప్రారంభించనున్నారు. అనంతరం ఆమె ఆసుపత్రిలోని స్టేట్ క్యాన్సర్ సెంటర్‌ను పరిశీలించనున్నారు. ఆ తర్వాత ఆసుపత్రిలో పలు విభాగాలను తనిఖీ చేయనున్నారు. అనంతరం అధికారులు, హెచ్‌వోడీలు, వైద్యులతో సమావేశం కానున్నారు.



సెంట్రల్ ల్యాబ్ వద్ద రిపోర్ట్‌ల కోసం నిరీక్షిస్తున్న రోగులు, వారి బంధువులు

పనిచేయని ఎక్స్‌రే ప్లాంట్లు

ఆసుపత్రిలో ఇటీవల కొత్తగా నిర్మించిన రేడియోడయోగ్నోస్టిక్ సెంటర్‌లో అవసరమైన పరికరాలను ఇంకా సమకూర్చలేదు. మరోవైపు ఆసుపత్రిలో ప్రస్తుతమున్న 8 ఎక్స్‌రే మిషన్లలో నాలుగు పనిచేయడం లేదు. మొబైల్ ఎక్స్‌రే యూనిట్ల ద్వారా ఎక్స్‌రేలు తీస్తున్నారు. ఈ కారణంగా ఉన్నవాటిపై అధికంగా భారం పడుతోంది. ఎక్స్‌రే ఫిల్మ్‌లు, రిపోర్ట్‌లు ఇచ్చే మిషన్ సైతం ఒకటి మరమ్మతుకు గురైంది. అవసరమైన ఫిల్మ్‌లను సైతం అధికారులు సరఫరా చేయడం లేదు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిని మరమ్మతు చేయించాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



పనిచేయని ఎక్స్‌రే ప్లాంట్



ఇంటి దేవుడు!

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటంతో గృహ ప్రవేశం చేస్తున్న ఈ దంపతుల పేర్లు గోవిందు, చంద్రమ్మ. చిప్పగిరి మండలం బంటన్‌హాలు గ్రామ వాసులు. వ్యవసాయ పనులు చేసుకుని బతికే వీరు గతంలో సొంత ఇల్లు లేక ఎన్నో కష్టాలు అనుభవించారు. పలు అవమానాలను సైతం ఎదుర్కొన్నారు. స్వగృహ స్వప్నం నెరవేరుతుందో లేదో అని ఆందోళన కూడా చెందారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వీరి కష్టాలు తీరాయి. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా వీరికి ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణానికి అవసరమైన రూ. 1.8 లక్షల డబ్బును ప్రభుత్వం బిల్లుల రూపంలో చెల్లించింది. ప్రభుత్వ సహకారంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని బుధవారం గృహ ప్రవేశం చేశారు. దేవుడి చిత్రపటాన్ని చేతిలో ఉంచుకుని నూతన ఇంటిలోకి వెళ్లడం సంప్రదాయం.. అయితే వీరు వైఎస్ జగన్ చిత్రపటంతో గృహ ప్రవేశం చేసి తమ ఇంటి దేవుడు ముఖ్యమంత్రి అని చాటి చెప్పారు.

– చిప్పగిరి



ప్రభుత్వ సాయంతో నిర్మించుకున్న ఇల్లు

అబద్ధాల్లో తండ్రిని మించిన లోకేష్

- యువగళం యాత్రకు ప్రజా స్పందన కరువు
- చంద్రబాబు హామీలపై సమాధానం ఇవ్వాలి
- దళితులంటే చిన్న చూపా?
- విలేకరుల సమావేశంలో రామయ్య, సుధాకర్

కర్నూలు(రాజ్‌విహార్): అబద్ధాలు చెప్పడంలో తండ్రి చంద్రబాబును నారా లోకేష్ మించి పోయారని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం కర్నూలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ.. యువగళం యాత్రకు ప్రజా స్పందన లేకపోవడంతో లోకేష్ అసత్య ప్రచారాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఏ ప్రాంతానికి వెళ్తే ఆ ప్రాంత ఎమ్మెల్యేపై అబద్ధాలు చెప్పి రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారన్నారు. నిజం మాట్లాడితే తల వెయ్యి ముక్కలు అవుతుందని చంద్రబాబుకు ఉన్న శాపం కారణంగా ఆయన అబద్ధాలే మట్లాడుతున్నారని, అదే అలవాటు లోకేష్‌కు వచ్చిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 14 ఏళ్ల కాలంలో జిల్లాకు ఏం చేశారో చెప్పాలన్నారు. కర్నూలులో 2014 ఆగస్టు 15న జాతీయ జెండా సాక్షిగా 30 రకాల హామీలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లాలో తిరుగుతున్న లోకేష్.. తండ్రి ఇచ్చిన హామీలపై సమాధానం ఇవ్వాలన్నారు. గుండ్రేవులు ప్రాజెక్టుకు 2019 ఎన్నికల నెల ముందు చంద్రబాబు జీవో ఇచ్చారని చెప్పే లోకేష్.. అందుకు నిధులు ఎన్ని కోట్లు ఇచ్చారో చెప్పాలన్నారు. హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని, ఏ సీఎం అమలు చేయని సంక్షేమ పథకాలు తమ అధినేత అమలు చేస్తూ చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య. చిత్రంలో కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్, పార్టీ నాయకులు

భూ కబ్జాలు చేసేది టీడీపీ నేతలే

కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. దళితులపై నారా లోకేష్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా అని చంద్రబాబు కూడా వివక్షతో మాట్లాడారని, దళితులంటే అంత చిన్న చూపా అని ఆవేదన వ్యక్తం చేశారు. లోకేష్ వ్యాఖ్యలకు నిరసనగా దళిత ఎమ్మెల్యేగా తాను యాత్రను అడ్డుకుంటానని గతంలోనే ప్రకటించానని, ఇందులో భాగంగా శాంతియుతంగా నిరసన తెలిపినట్లు వెల్లడించారు. తనపై అసత్య ఆరోపణలు చేశారని, వాస్తవానికి తన నియోజకవర్గంలో భూ కబ్జా చేసిందంతా టీడీపీ నేతలే అన్నారు. తులశాపురంలోని 30 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూమిని టీడీపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి కబ్జా చేశారని, పసుపుల, నిడ్జూరులో సైతం ఆ పార్టీ నేతలే అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి వాస్తలను దాచి పెట్టి తనపై అసత్య ఆరోపణలు చేయడం దారుణమన్నారు. కోడుమూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ లోకేష్‌కు సవాల్ చేశారు. విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకుడు మద్దయ్య, కార్పొరేటర్లు రాజేశ్వరరెడ్డి, కృష్ణకాంత్, నాయకులు కర్నాటి పుల్లారెడ్డి, లక్ష్మీకాంతయ్య, జెడ్పీటీసీ సభ్యులు మౌలాలి, గిరి, రాజేష్ పాల్గొన్నారు.

కారుణ్యం చూపుతూ.. ఉద్యోగాలిస్తూ

- మృతుల కుటుంబాలకు అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వం
- పీటీడీలో బెడ్ విన్నర్ స్కీమ్ కింద ఉద్యోగాల భర్తీకి చర్యలు
- జిల్లాలో 39 మందికి ఛాన్స్
- 2016 నుంచి ఉన్న పెండింగ్ దరఖాస్తులకు మోక్షం
- నేటి నుంచి దేహదారుఢ్య పరీక్షలు



కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా రవాణా శాఖ(పీటీడీ)లో పనిచేస్తూ చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. మృతుల కుటుంబంలో ఒకరికి బెడ్ విన్నర్ స్కీమ్ (కారుణ్య నియామకాల పథకం) కింద ఉద్యోగం ఇస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు విడతలుగా కారుణ్య నియామకాలను చేపట్టింది. తాజాగా మూడో విడత కింద ఆ శాఖలోనే కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు గత నెల 17న అభ్యర్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. వీరికి గురువారం నుంచి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 39 మందికి ఉద్యోగాలు రానున్నాయి.

ప్రక్రియ ఇలా...

సంస్థలో పనిచేస్తూ చనిపోయిన కార్మికులు, ఉద్యోగుల పిల్లలు ఉద్యోగ అవకాశం కోరుతూ ఏడాదిలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఉద్యోగం కోరిన వ్యక్తి ఉద్యోగి భార్య/భర్తతో పాటు అన్నదమ్ముల నుంచి ఎన్‌ఓసీ, వారసత్వ సర్టిఫికెట్ సమర్పించాలి. దీనిపై ఆర్టీసీ సెక్యూరిటీ, విజిలెన్స్ అధికారులు విచారణ జరుపుతారు. విద్యార్హత, కుల, నివాస తదితర సర్టిఫికెట్లు పరిశీలించి ధ్రువీకరిస్తారు. అన్ని సక్రమంగా ఉంటే వారికి ఉద్యోగం ఇవ్వవచ్చని సిఫార్సు చేస్తారు.

పట్టించుకోని చంద్రబాబు సర్కార్

ఆర్టీసీలో పనిచేస్తూ చనిపోయిన ఉద్యోగస్తుల పిల్లలు కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకొని ఏళ్ల తరబడి ఎదురు చూశారు. 2019 కంటే ముందు ఉమ్మడి జిల్లాలో 172 మంది దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి చంద్రబాబు సర్కార్ పట్టించుకోలేదు. వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు కారుణ్య నియామకాల కింద 2019 నుంచి విడతల వారీగా ఉద్యోగాలిచ్చారు. తాజాగా మరోసారి ఉద్యోగాలు ఇవ్వనున్నారు.

మూడో విడుతలో 39 మందికి ఛాన్స్

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూడో విడత కారుణ్య నియామకాల కింద 39 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. ఇది వరకు 70కి పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ సచివాలయ ఉద్యోగాలిచ్చారు. మొదటి విడతలో డిగ్రీ అర్హత, ఆప్షన్ మేరకు గ్రామ పంచాయితీ సెక్రటరీలుగా 8 మందికి, వార్డు సెక్రటరీలుగా ఇద్దరికి, వెల్ఫేర్ సెక్రటరీలుగా ఇద్దరికి, నంద్యాల జిల్లాలో 8 మందికి పంచాయతీ సెక్రటరీలుగా, రెండో విడతలో ముగ్గురికి జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలిచ్చారు. 2016 జనవరి 1 నుంచి 2019 డిసెంబరు 31 వరకు ఉన్న 54 పెండింగ్ దరఖాస్తుల్లో మూడో విడతలో ఆర్టీసీ కానిస్టేబుల్ (10వ తరగతి అర్హతతో) ఉద్యోగాలు ఇచ్చేందుకు సర్టిఫికెట్లు పరిశీలించారు. ఇందులో 39 మంది అర్హత సాధించగా వీరిలో 30 మంది పురుషులు, తొమ్మిది మంది స్త్రీలు ఉన్నారు. దీంతో ఆయా కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

నేటి నుంచి దేహదారుఢ్య పరీక్షలు

ప్రజా రవాణా శాఖలో ఖాళీగా ఉన్న 21 కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ఇటీవలే ఎత్తు, బరువు, ఛాతీ కొలతలు తీసుకున్నారు. అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 4, 5వ తేదీల్లో స్థానిక సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల మైదానంలో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి వెంకటరామం తెలిపారు. ఇందులో అర్హత సాధించని, కానిస్టేబుల్ ఉద్యోగానికి ఆసక్తి చూపని అభ్యర్థులకు మరో విడతలో శ్రామిక్ పోస్టులు ఇవ్వనున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలపై ప్రత్యేక దృష్టి

కర్నూలు(అర్బన్): సహాయ సంక్షేమాధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా సాంఘిక సంక్షేమం, సాధికారత అధికారి ఎస్‌పీఎస్ ఎన్ రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక సంక్షేమ భవన్‌లోని తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలకు సంబంధించి జిల్లాలోని కళాశాల వసతి గృహాల్లో 478 మంది విద్యార్థులకు గాను 209 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులందరినీ ఉత్తీర్ణులను చేయించే బాధ్యతను సంబంధిత వసతి గృహ సంక్షేమాధికారులు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కర్నూలు సహాయ సంక్షేమాధికారి బీ మద్దిలేటి, వసతి గృహ సంక్షేమాధికారులు సుంకన్న, కరుణలత, శిరీష, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

డోన్ అభివృద్ధిపై మీరా మాట్లాడేది?

- దొంగసారా కేసులో జైలుకు వెళ్లిన చరిత్ర నీది
- టీడీపీ డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌పై ఆర్థికమంత్రి విమర్శలు
- అక్రమ మైనింగ్, ఇసుక మాఫియా కేరాఫ్ టీడీపీ నాయకులేనని ధ్వజం


పాదయాత్ర చేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్యాపిలి: 'దొంగసారా కేసులో మూడేళ్ల పాటు జైలు శిక్ష అనుభవించి వచ్చిన చరిత్ర నీది..మైనింగ్, ఇసుక, రియల్ ఎస్టేట్ మాఫియా నాయకులను వెంట పెట్టుకుని పాదయాత్ర చేస్తున్న ఘనత మీ పార్టీ నాయకుడిది..' మీరా డోన్ నియోజకవర్గంలో అభివృద్ధి గురించి మాట్లాడేది అని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి టీడీపీ డోన్ ఇన్‌చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డి, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేష్‌పై మండిపడ్డారు.

స్థానిక బోరెడ్డి పుల్లారెడ్డి ఫ్యాక్టరీ ఆవరణలో బుధవారం సింగిల్ విండో అధ్యక్షుడు బోరెడ్డి రామచంద్రారెడ్డి (రాము) అభినందన సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్థికశాఖ మంత్రి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. యువగళం పాదయాత్రలో భాగంగా డోన్ నియోజకవర్గంలోని డి. రంగాపురం నుంచి ఎస్ రంగాపురం వరకు లోకేష్ చేపట్టిన పాదయాత్ర తాము కొత్తగా వేసిన రోడ్ల పైనే సాగిందని మంత్రి అన్నారు. గత ప్రభుత్వాలు నంద్యాల నీటి పథకాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని మంత్రి ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకానికి అవసరమైన నిధులు కేటాయించి మొత్తం 18 గ్రామాలకు నిరంతరాయంగా నీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో నీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నామని, అయినప్పటికీ టీడీపీ నాయకులు నీటి సమస్య ఉందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంతో తాను పని చేస్తున్నట్లు తెలిపారు. డోన్-రాయలచెరువు రోడ్డు, ప్యాపిలి-పత్తికొండ తదితర రోడ్లన్నీ డబుల్ రోడ్డుగా మార్చామని చెప్పారు. త్వరలోనే రాచర్ల-బూరుగల రోడ్డును కూడా డబుల్ రోడ్డు చేస్తున్నామన్నారు. చెరువులకు నీటిని నింపే కార్యక్రమం ద్వారా తాగు, సాగు నీటి సమస్య లేకుండా చేస్తున్నామన్నారు.

దొంగ మైనింగ్‌పై 100 కోట్లు పెనాల్టీ నిజం కాదా ?

టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డి దొంగసారా కేసులో 3 నెలలు జైలుకు వెళ్లొచ్చాడని, ఇలా ప్రతి దాంట్లో ఆ పార్టీ నాయకులు ఆరితేరారని మంత్రి విమర్శించారు. తెలుగుదేశం పార్టీ హయాంలోనే ప్రస్తుతం టీడీపీ ఇంచార్జ్‌గా ఉన్న వ్యక్తికి దొంగ మైనింగ్ చేస్తున్నాడని 100 కోట్ల పెనాల్టీ విధించిన విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు అవినీతి, అక్రమాలు ప్రజలకు తెలుసన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, డోన్ మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి, హుసేనాపురం సింగిల్‌విండో అధ్యక్షుడు బాలయ్య, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ దిలీప్ చక్రవర్తి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జున రెడ్డి, డోన్ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, న్యాయవాది నాగభూషణ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బోరెడ్డి పుల్లారెడ్డి, రామచంద్రారెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏనాడైనా ఆలయాల గురించి ఆలోచించారా?

నియోజకవర్గంలోని అన్ని పురాతన ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. గుండాల చెన్నకేశవ స్వామి ఆలయాన్ని రూ.10 కోట్లతో, బేతంచెర్ల మండలంలోని మద్దిలేటి స్వామి ఆలయాన్ని రూ.50 కోట్లతో, రాచర్ల సమీపంలోని కంబగిరి స్వామి ఆలయానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీకి చెందిన ఇన్‌చార్జ్‌లు, ఉప ముఖ్యమంత్రి ఏనాడైనా ఆలయాలను అభివృద్ధి చేశారా అని మంత్రి ప్రశ్నించారు. ఓ వైపు తాము ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తుంటే ఓర్వలేక టీడీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నారని, అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ప్యాపిలి సమీపంలో రూ.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ టర్మినల్ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

చంద్రపల్లె-పీఆర్ పల్లె రోడ్డు ప్రారంభోత్సవం

మండల పరిధిలోని చంద్రపల్లె-పీఆర్ పల్లె డబుల్ రోడ్డును (డోన్-రాయలచెరువు) ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. రూ. 46 కోట్లతో వేసిన ఈ రోడ్డు పనులు ఇటీవలే పూర్తయ్యాయి. రోడ్డు ప్రారంభించిన అనంతరం మంత్రి చంద్రపల్లె నుంచి పీఆర్ పల్లె వరకు 8 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. దారి పొడవునా మంత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. మధ్యలో పలువురు మహిళా కూలీలు మంత్రిని కలసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకు అందుతున్నాయని సంతోషం వెలిబుచ్చారు.



6న 'అనంత'లో భారీ వ్యవసాయ యంత్ర ప్రదర్శన

కర్నూలు(అగ్రికల్చర్): కేంద్ర ప్రభుత్వ రంగసంస్థ దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రముల శిక్షణ, పరీక్షణ సంస్థ అనంతపురంలోని ట్రాక్టర్ నగర్‌లో ఈ నెల 6వ తేదీన భారీ వ్యవసాయ యంత్ర ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ కమలాబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు 80 కంపెనీలకు చెందిన 300-400 యంత్ర పరికరాలను ప్రదర్శనకు పెట్టి వాటి ఉపయోగాలు, వినియోగించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. రైతులు ఈ ప్రదర్శనకు హాజరై ఆధునిక యంత్ర పరికరాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

పీజీ పరీక్షలకు 27 మంది గైర్హాజరు

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న పీజీ పరీక్షలకు బుధవారం 27 మంది గైర్హాజరయ్యారు. వర్సిటీతోపాటు ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన ఐదు కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 600 మంది విద్యార్థులకుగాను 573 మంది విద్యార్థులు హాజరైనట్లు వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

అనారోగ్యంతో ఖైదీ మృతి

కర్నూలు: కడప సెంట్రల్ జైలులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తూ అనారోగ్యానికి గురై కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక తెలుగు రామాంజనేయులు మృతిచెందాడు. నంద్యాల జిల్లా వెలుగోడు గ్రామానికి చెందిన తెలుగు జమ్మన్న 2007లో హత్యకు గురయ్యాడు. ఈ కేసులో తెలుగు రామాంజనేయులు ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. కర్నూలు జిల్లా సెషన్స్ కోర్టు రామాంజనేయులుకు 2017లో యావజ్జీవ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. అప్పటి నుంచి కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. కిడ్నీ జబ్బు, షుగర్‌తో పాటు గ్యాంగ్రీన్ జబ్బు తీవ్రం కావడంతో గత నెల 18వ తేదీన జైలు అధికారులు కర్నూలుకు తీసుకువచ్చి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్సలు చేయించారు. కోలుకోలేక మంగళవారం రాత్రి మృతిచెందాడు. కడప జైలు సూపరింటెండెంట్ ప్రకాష్ ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్ సమక్షంలో మృతదేహానికి పంచనామా నిర్వహించారు.

లోకేష్‌కు రాజకీయ పరిజ్ఞానం లేదు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

- కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు రూరల్: నారా లోకేష్‌కు రాజకీయ పరిజ్ఞానం లేదని కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్(కుడా) చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం కోడుమూరు సొసైటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో కోడుమూరు నియోజకవర్గంలో రూ.300కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని, పనులను చూపించేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నామంటూ లోకేష్, టీడీపీ నేతలకు సవాల్ విసిరారు. గాజులదిన్నె రిజర్వాయర్ పెంచేందుకు ప్రభుత్వం రూ.55కోట్లను మంజూరు చేసిందన్నారు. కోట్ల విజయభాస్కరరెడ్డి స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని తాను రాజకీయాల్లో కొనసాగుతున్నానన్నారు. అక్రమాలకు పాల్పడాల్సిన ఖర్మ తమకు లేదన్నారు. తెలంగాణలో పుట్టి పెరిగిన లోకేష్‌కు రాయలసీమ పరిస్థితులెలా తెలుస్తాయని ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎవరో రాసిచ్చిన చీటీలను చదువుతూ లోకేష్ పాదయాత్ర చేస్తుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విలేకరుల సమావేశంలో కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ క్రిష్ణారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు ప్రవీణ్‌కుమార్, ఈశ్వర్‌రెడ్డి, రవికుమార్ రెడ్డి, రమేష్‌నాయుడు, వేణుగోపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, శివరాముడు, తేనేశ్వరరెడ్డి, వెంకటశివుడు, ధరణేశ్వరరెడ్డి, లింగన్న, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లోకాయుక్త చైర్మన్‌ను కలసిన జేసీ


జస్టిస్ పి. లక్ష్మణ్‌రెడ్డికి పూలబొకే అందిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(అర్బన్): ఏపీ రాష్ట్ర లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పీ లక్ష్మణ్‌రెడ్డిని జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం ఆమె స్థానిక లోకాయుక్త కార్యాలయానికి వెళ్లి జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డికి పూల బోకేను అందించారు.

నకిలీ విత్తనాలమ్మితే కఠిన చర్యలు

కర్నూలు(అగ్రికల్చర్)/కోడుమూరు రూరల్: నకిలీ విత్తనాలు, పురుగు మందులు అమ్మినా, ఎరువులను కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మి హెచ్చరించారు. బుధవారం కర్నూలులోని ఉద్యాన భవన్‌లో, కోడుమూరులోని మండల పరిషత్ సమావేశ భవనంలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లు, హోల్‌సేల్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయా సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ.. విత్తనాలు, పురుగుమందులు, రసాయన ఎరువులకు సంబంధించి కొత్త స్టాక్ వచ్చినపుడు విధిగా వ్యవసాయ శాఖకు తెలియచేయాల్సి ఉందన్నారు. ఏ జిల్లాకు లైసెన్స్ తీసుకొని ఉంటే జిల్లా పరిధిలోని రైతులకే విత్తనాలు, ఎరువులు విక్రయించాలని ఆదేశించారు. ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి అధికంగా వసూలు చేసినా లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. అనుమతి లేని విత్తనాలు, మందులమ్మితే కేసులు నమోదుకు వెనకాడబోమన్నారు. జిల్లాలో ఎరువులు, మందుల కొరత లేదని, డీలర్లు ఎవరూ కృత్రిమ కొరత సృష్టించరాదన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏడీఏలు సాలురెడ్డి, వెంకటేశ్వర్లు, ఏఓలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీఎల్ వరలక్ష్మి

వైద్యులు బాధ్యతగా పనిచేయాలి

- అకడమిక్ డీఎంఈ డాక్టర్ సత్యవరప్రసాద్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ, ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులు బాధ్యతగా పనిచేయాలని అకడమిక్ డీఎంఈ డాక్టర్ సత్యవరప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో నిర్మిస్తున్న స్టేట్ క్యాన్సర్ సెంటర్ పనులను పరిశీలించారు. మెడికల్ కాలేజీలో హాస్టల్‌లో ఉంటున్న వైద్య విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం హెచ్‌వోడీలు, వైద్యులతో కళాశాల కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో నిర్మిస్తున్న భవనాలు ఆయా విభాగాలకు అనుగుణంగా ఉంటేనే సంతకాలు చేసి స్వాధీనం చేసుకోవాలన్నారు. ఆయా విభాగాలకు అవసరమైన వైద్యపరికరాలు, పోస్టుల కోసం లిఖిత పూర్వకంగా ఇండెంట్ పెట్టాలని సూచించారు. ఆసుపత్రిలో వైద్యపరికరాల మరమ్మతులను డాక్యుమెంటేషన్ చేయాలన్నారు. ఆసుపత్రిలో పనికిరావనుకున్న పరికరాలను విభాగాల్లో ఉంచుకోకుండా ఒకచోటకు చేర్చి అనంతరం విక్రయించాలన్నారు. కళాశాల, ఆసుపత్రిలో నూతన విభాగాలు, పలు విభాగాల పేర్లు మార్పులు జరిగాయని, వీటికి అనుగుణంగా బోర్డులు మార్చుకోవాలని సూచించారు. క్యాజువాలిటీలో సీఏఎస్‌లు మెడికల్ ఆఫీసర్లుగా ఉండరని, ఇకపై ఎస్ఆర్‌లు, పీజీలే వైద్యులుగా పనిచేస్తారన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటరంగారెడ్డి, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ హరిచరణ్ పాల్గొన్నారు.


ఆసుపత్రిని పరిశీలిస్తున్న డాక్టర్ సత్యవరప్రసాద్

విలువలేని 'విష్ణు'చక్రం!

పొమ్మనలేక పొగబెట్టిన టీడీపీ
- లోకేష్ పాదయాత్రలో దక్కని ప్రాధాన్యత
- ప్రశ్నార్థకంగా మారిన రాజకీయ భవిష్యత్

కోడుమూరు: రాజకీయంగా కోడుమూరు నియోజకవర్గంలో ఓ వెలుగు వెలిగిన విష్ణువర్ధన్‌రెడ్డి రాజకీయ భవిష్యత్ ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. 2014లో జిల్లా పరిషత్ చైర్మన్ పదవి టీడీపీ చేజిక్కించుకోవడంలో కీలకంగా వ్యవహరించిన విష్ణుకు కోడుమూరు నియోజకవర్గంలో ఆ పార్టీ పెద్దపీట వేసింది. అయితే ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు కోట్ల, కేఈ సోదరులకే అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నారు. నేరుగా చెప్పకపోయినా విష్ణు పార్టీలో ఉన్నా లేనట్లుగానే అధిష్టానం వ్యవహరిస్తోంది. తాజాగా లోకేష్ పాదయాత్రలోనూ కోట్ల ఇచ్చిన రూట్ మ్యాప్‌నే పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో విష్ణు కూడా అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 2న యాత్ర కోడుమూరు నియోజకవర్గంలోకి ప్రవేశించగా బొకే అందజేయడంతో విష్ణు పాత్ర ముగిసింది. రెండోరోజు కోడుమూరులో బసచేసిన లోకేష్‌ను విష్ణు ప్రత్యేకంగా కలిసి మాట్లాడి వెళ్లిపోయారు. ప్రత్యక్షంగా ఆయనకు ఎక్కడా ప్రాధాన్యత దక్కకపోవడం టీడీపీలోనే చర్చనీయాంశంగా మారింది. టీడీపీని నమ్ముకుంటే ఏ స్థాయి నాయకులకైనా చివరకు ఇలాంటి అనుభవం తప్పదనే అభిప్రాయం వినిపిస్తోంది.

యువగళంలో 'గౌరు'కు చుక్కెదురు

కర్నూలు: నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. కల్లూరు మండలం రేమడూరు వద్ద నారా లోకేష్ విడిది చేసిన శిబిరంలోకి గౌరు దంపతులు వెళ్లేందుకు ప్రయత్నించగా అక్కడ కాపలాగా ఉన్న వలంటీర్లు అడ్డుకున్నారు. దీంతో గౌరు అనుచరులు, యువగళం సభ్యుల మధ్య తోపులాట జరిగింది. గౌరు వెంకటరెడ్డి అనుచరులు వలంటీర్లపై చేయి చేసుకుని తోసేశారు. అనంతరం గౌరు దంపతులు శిబిరంలోకి వెళ్లారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన వలంటీర్లు అక్కడ విధులు నిర్వహించకుండా అలక వహించారు. దీంతో శిబిరం లోనుంచి బయటకు వచ్చిన గౌరు దంపతులు వలంటీర్లకు క్షమాపణ చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.


కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు (క్వింటల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	3,002	6,649
పొద్దుతిరుగుడు	4,509	4,509
ఆముదం	4,869	5,314
వాము	4,220	17,099
ఉల్లి	301	301
ఎండు మిర్చీ	3,099	18,890
శనగలు	4,416	4,570
కందులు	3,190	8,032
మొక్కజొన్న	1,301	1,769
మినుములు	6,869	7,269

ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొని ఒకరు మృతి

- ఇద్దరికి గాయాలు

కర్నూలు: రోడ్డుపై నిల్చొని మాట్లాడుతున్న ముగ్గురు వ్యక్తులను ఓ ప్రైవేట్ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు మండలం ఉల్చాల గ్రామానికి చెందిన కురువ శివ కుటుంబ సభ్యులతో కలసి నాగలాపురం రోడ్డులో ఉన్న పొలానికి పనుల కోసం వెళ్లాడు. ఉల్చాల గ్రామానికి చెందిన రాముడు, తిమ్మప్పలు ద్విచక్ర వాహనంపై అదే రోడ్డు గుండా నాగలాపురానికి వెళ్తుండగా పొలం పనుల్లో ఉన్న కురువ శివ కనిపించాడు. వారిని రోడ్డుపై ఆపి కురువ శివ మాట్లాడుతుండగా అదే సమయంలో గౌతమ్ స్కూల్‌కు చెందిన బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ముగ్గురూ తీవ్ర గాయాలకు గురయ్యారు. ఇద్దరిని ఆటోలో, మరొకరిని 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక కొద్దిసేపటికే కురువ శివ మృతిచెందాడు. రాముడు, తిమ్మప్పలు చికిత్స పొందుతున్నారు. బస్సు డ్రైవర్ సుబ్బుశేఖర్‌రెడ్డి నిర్లక్ష్యం వల్లే ప్రమాదం చోటుచేసుకుందని మృతుడి సోదరుడు సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదంలో మృతిచెందిన కురువ శివ